# మెట్ట బతుకులు

-యమ్వీ రామిరెడ్డి

మా ఊరు జీవనదికి కేవలం ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. కానీ చుక్క నీరందదు.

తాతల్నాడు తవ్విన కాల్వల గుండా నా చిన్నప్పుడెప్పుడో నెల్లాళ్ళు నీళ్ళు ప్రవహించిన జ్ఞాపకం!

ఎలక్షన్లొచ్చిన ప్రతిసారీ కాలువనీరు ప్రవహించి మా భూములన్నీ సస్యశ్యామలం అయిపోయిన భ్రమ కల్గిస్తారు నాయకులంతా!

తీరా పదవిని పట్టు పంచెలా కట్టుకోగానే 'తోక'కు కట్టిన బద్దలు ఊడదీస్తారు.

మా భూములన్నీ మాగాణ్ణి అయిపోతే, ఎకరానికి నలభై బస్తాల ధాన్యం పండించి, మా బతుకుల ఛాయలుండి ఆకలి భూతాన్ని తరిమెయ్యాలనీ...సంవత్సరం పొడవునా పచ్చని పైర్ల మీద మా స్వేదాన్ని వెదజల్లుకుంటూ ఎంచక్కా ఖరీఫ్‌నీ, రబీనీ అనుభవించెయ్యాలనీ...ఎన్నెన్ని కలలు కన్నామో?



ఎప్పుడో ప్రయాణించే బస్సులోంచో, పరుగులు తీసే రైలు కిటికీ లోంచో మాగాణీ ప్రాంతం చూసి సంతోషించడం తప్ప - మా కలలెప్పుడూ గగనకుసుమాలే!

మా గడ్డ నెత్తిన మహానుభావుడెవరో గానీ పూర్వం ఈ ప్రదేశమంతటా సముద్రాలు ప్రవహించి, ఉప్పంతా అట్టడుగున పేరుకు పోయినట్టు - ఎక్కడైనా బావి త్రవ్వినా, బోరు వేసినా కటిక ఉప్పునీళ్ళు పడతాయి.

ఒక సన్నని కాలువ మార్గం ద్వారా సాగర్‌నుంచి పెద్ద చెరువుకి నీళ్ళు పెడితే - ఇక సంవత్సరమంతా పిల్లలకీ, పశువులకీ తాగడానికా చెరువే పెద్ద దిక్కు!

వేసవి సెగలు మొదలవుతూనే ఆ చెరువుకి కాస్తా ఎండగడతాయి. ఇక కావిళ్ళూ, సైకిళ్లూ వేసుకొని 'పానీ' కోసం పక్క గ్రామాలకు పరుగులు తీయాల్సిందే!

దాంతో మా పొలాలన్నీ వర్షాధారమై పోయాయి. తొలకరి కాగానే గణపతికో టెంకాయ కొట్టి, భారం వాన దేవుడిమీద పడేసి నాగలు చేతబట్టడం తప్ప, మేం చేయగల్గిందంటూ మరేం మిగలకుండా పోయింది.

ఆ సంవత్సరం పేలాల పిండి పండగొచ్చినా తొలకరి జల్లు పడలేదు. నెర్రెలు బారిన భూములన్నీ నోళ్ళు తెరుచుకొని దాహం తీర్చే మేఘం కోసం ఆకాశం వంక ఆశగా చూస్తుండి పోయాయి.

వరుణుడి కరుణ కోసం మా నమ్మకాల్నీ, ఆచారాల్నీ ధారపోశాం. కప్పల పెళ్ళిళ్ళు చేశాం. ప్రభ లూరేగించాం. రోజూ నూటొక్క బిందెల నీళ్ళతో వినాయకుణ్ణి అభిషేకించాం. భజనలు చేశాం. కొలువులు కొలిచాం. నిజంగానే మా మొర వినిపించిందో లేక సమయమొచ్చిందో- ఎలాగైతేనేం తొలకరి జల్లుతో మా పొలాలు పులకరించి పోయింది.

పోట్లగిత్తల మెళ్ళల్లో పట్టెడ గంగలు గణ గణ మోగాయి. నేల పదునయింది. అరకలు సాగాయి. విత్తనం నాటాం. వాతావరణం దయ చూపింది. మొలకలు బయటికి తొంగి చూశాయి. మా గుండెలు సంతోషంతో ఉబ్బిపోయాయి.

మొలకలు మొక్కలై, మా కంటికి రెప్పలయ్యాయి. ఎప్పటికప్పుడు కలుపు తీస్తూ, బలం మందు వెదబెడుతూ మొక్కల్ని మరి కాస్త సాగ దీశాం.

పొలాలన్నీ పూతకొచ్చి పచ్చదనం వెల్లవిరు స్తోంది. గూడ దిగి కాయలు కాచి అధిక దిగుబడి వచ్చినట్లు కలల కౌగిలింతలో మేమంతా ఆదమరచి ఉండగా - మొన్న కరుణించని వాన దేవుడు ఒక్కసారిగా విరుచుకు పడ్డాడు. అక్కడ పొలాలన్నీ వర్షం దెబ్బకి విలవిల్లాడి పోతూంటే, ఇళ్ళల్లో మేమంతా పెనుగాలి శరాఘాతానికి తల్లడిల్లిపోయే చివురుటాకుల్లా వణికిపోయాం.

పొద్దున్నే లేచి పొన్ను కర్ర పట్టుకొని, గుండె దిటవు చేసుకొని ఆత్రంగా పొలం వైపు పరుగుతీశాం. పూత, పిందె రాలిపోయి వెలవెలబోతూ వెక్కిరించాయి చెట్లన్నీ.

దెబ్బలు తినటం అలవాటేగా! ప్రాణాలుగ్గ బెట్టుకొని మళ్ళీ మోడులకే సేవలు చేయడం ప్రారంభించాం. కాస్త

సానుకూల పవనాల వల్ల పరిస్థితి త్వరలోనే చక్కబడి, చెట్లు పచ్చబడ్డాయి. ఇంతలో ఎవరో టెలిగ్రాం ఇచ్చినట్లు హడావుడిగా వచ్చిచేరింది పురుగు!

ఇక మందుల సీజనొచ్చింది. ఆ సరికే సొసైటీ బ్యాంకులిచ్చిన అప్పులన్నీ అయిపోయాయి. తప్పేదేముంది? 'తల'లున్నాయిగా! తాకట్టుపెట్టి కొత్త కొత్త కంపెనీల మందులు తెచ్చి వాడాం.

విషం తిని జీర్ణించుకోవడం అలవాటు చేసుకున్నాయేమోపురుగులు! మందు పవర్ తగిలి రోజు కొక్కరన్నా హాస్పటల్‌పాలు కావడం తప్ప, పురుగు చావ లేదు.

పురుగులు... పురుగులు... రసం పీల్చేస్తూ... ఆకుల్ని మసిచేస్తూ... కాయల్ని తొలిచేస్తూ గుండెల్ని నలిపేస్తూ!

డెబ్బైఆరులోనో ఎనభైమూడులోనో ప్రత్తిపంట పుణ్యమాని రైతు పచ్చగా కళకళలాడిన మాట నిజమే!

కానీ పరిస్థితులు తలకిందులయ్యాయి. తలరాతలు మారిపోయాయి. ఎకరానికి మహా అయితే ఏ రెండు మూడు క్వింటాల్లో. దాంతో బ్యాంకుల్లో వడ్డీలు తీరే దారి కూడా కనబళ్ళేదు.

రాబడి కొరవడి పూట గడవడం కష్టమైపోయింది. పిల్లాపాప ఆకలి బాధతో అల్లాడిపోయారు. ఒక్కసారిగా కష్టాలన్నీ కూడబలుక్కుని మీద పడ్డాయి. చాలా గుండెలు తట్టుకోలేక పోయాయి.

కొంతమంది ఆత్మని చంపుకోవడం తప్ప పర్యవసానం కనుగొనలేని బలహీనులయ్యారు.

అంతే! ఒక్కసారిగా మా ప్రాంతమంతా ప్రత్తిరైతుల ఆత్మహత్యలతో కంపించి పోయింది.

ఒక శకం ముగిసింది.

పోయినేడు పంట మార్పిడి పద్ధతి నుంచి ఫలితాన్నిచ్చింది. ప్రత్తి చాలా వరకు కనుమరుగైపోయి, అపరాలు అధికారంలోకి వచ్చాయి. మినుము, పెసర బాగా పండుతున్నాయి.

నేనో మధ్యతరగతి చిరం'జీవి'ని! పెద్దపిల్లకి పెళ్ళైపోయింది. కొడుకు కష్టపడి చదివి ఎమ్‌సెట్‌లో ర్యాంకు తెచ్చుకున్నాడు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటొచ్చింది. ఖర్చు దృష్ట్యా కాస్త ఆలోచించగల హృదయంతో తను చేరనన్నాడు. కానీ పప్పుల పంట నా భుజం తట్టి ప్రోత్సహించింది. ఫీజుకట్టి చేర్పించాను. చిన్నమ్మాయి పెళ్ళికి సిద్ధంగా ఉంది.

నిరుటి ఉత్సాహంతో మరో ఆరెకరాలుకౌలుకి తీసుకొన్నాను. నాలుగెకరాల్లో మినుము, మిగిలింది పెసర పెట్టాను. దేవుడి దయవల్ల తొలకరి నుంచీ వాతావరణం అనుకూలంగా ఉంది. సరైన సమయంలో వర్షం కురిసి పైరుపూత కొచ్చింది.

చేనంతా అల్లుకుపోయిన చెట్ల పచ్చదనాన్నీ, వాటి కొసల్నుండి తొంగి చూస్తోన్న తెల్లటి పూతనీ చూస్తూ గంటల్తరబడి అక్కడే ఉండి పోవాలనిపించేది.

హఠాత్తుగా మందుల ధరలువిపరీతంగా పెరిగిపోయాయి. తాతయ్య ఎప్పుడూ అంటుండే వాడు మినువులు ఎదబెడితే మళ్ళీ కోతకోసుకోడానికే పొలం మొహం చూసేవాళ్ళమని! మరి ఇప్పుడో - విత్తిన దగ్గర్నుంచీ పండేదాకా భుజాలకు ట్యాంకులో, పవర్ స్ప్రేయర్లో వేలాడాల్సిందే!

మొత్తానికి రెక్కలు తెగేలా యీదితే తీరం చేరువలోకొచ్చింది. పదెకరాల పొలమూ కాయల భారంతో వొంగిపోయి, చూస్తూంటేనే కడుపు నిండిపోతోంది. కాయ లు నల్లబడ్డాయి. మబ్బులు నల్లబడక ముందే ఇంటికి చేర్చుకోమని పొలం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఆ రోజు పొద్దున్నే చద్దితిని పొలం బయల్దేరాను. ఇరవై మంది కూలీలతో కోత ప్రారంభమైంది. మరుసటి రోజూ కోత కొనసాగింది.

బాడవ పొలంలో ఉన్నఎకరంలో మాత్రం పచ్చికాయ ఉండడంవల్ల కోత పళ్ళేదు. తొమ్మిదెకరాల్లోని కట్టెనీ కళ్ళాలుగా పేర్చి ఎండబెట్టాం. రేపు ట్రాక్టరుతో తొక్కించి, తూర్పారబోసి, గింజలు ఇంటికి చేర్చుకోవాలి.

ఆ రాత్రి మహదానందంగా ఉంది నాకు. పగలంతా కష్టపడ్డందువల్ల వెంటనే నిద్రపట్టింది.

అర్థరాత్రి దాటుతుందేమో... ఫెళ్ ఫెళ్‌మని శబ్దాలు మెల్లగా కళ్ళు విప్పి కిటికీ లోంచి బయటికి చూశాను... ఆకాశవీధుల్లో కాంతి ద్రవంతో కళ్ళాపు చల్లుతున్నట్లు-మెరికలు దిగ్గున లేచి కూర్చున్నాయి.

కుండపోతగా వర్షం! గుడిశెలు కొట్టుకుపోయే గాలి!

కళ్ళముందు లీలగా ఏవో అస్పష్ట దృశ్యాలు...

తొమ్మిదెకరాల బంగారు పంట. కళ్ళాలుగా పేర్చిన కట్టె గాలివేగానికి ఏ సుదూరతీరాలకో కొట్టుకుపోగా, మిగిలిన దాన్లోంచి వానకు తడిసిచేతికొచ్చే నాలుగ్గింజల ముక్క వానకు ఏ మాత్రం రేటు పడుతుంది?

నోటి దగ్గర కూటికి ఏ రాక్షస హస్తమో నిర్దాక్షిణ్యంగా ఎగరేసుకు పోతోంది.

చిన్న కూతురి పెళ్ళి పందిరి కూలి పోతోంది.

చేసిన బాకీ కొండలా పెరిగి పోతోంది.

గుండెల్లో సన్నగా నొప్పి మొదలైంది.

పగలంతా పనిచేసి అలసిపోయిన ఇల్లాలు ఆదమరచి నిద్రపోతోంది. కాబోయే భర్త గురించి కలల గూడు నల్లుకుంటూ దుప్పట్లో మునగదీసుకుంది కూతురు.

నోరు పిడచకట్టుకు పోతోంది.

పిలుపు గొంతుదాటి రాలేక పోతోంది.

గుండెల్లో నొప్పి ఎక్కువౌతోంది.

బయట జోరువానతో కాంట్రాక్టు కుదుర్చుకొని హోరుగాలి దుఃఖసంగీతాన్ని వీధుల్నిండా పారబోస్తోంది.

నొప్పితో పాటు ఆలోచన్లూ సుడులు తిరుగుతున్నాయి.

ఈ దెబ్బ నుండి మళ్ళీ కోలుకోవడమెలా?

కొడుకు చదువు అర్ధాంతరంగా ఆగి పోవల్సిందేనా?

వాడికీ ఈ పొలంతో జూదం అర్ధం తప్పదా?

భార్యకున్న ఒకే ఒక్క బంగారు గొలుసు తాకట్టు సంకెళ్ళను విడిపించుకొనేది మళ్ళీ ఎన్నాళ్ళకి?


గుండెల్లో నొప్పి... భరించలేంతగా!

మెల్లగా మంచం మీదికి వాలిపోయాను.

ఎమ్.వి. రామిరెడ్డి
కేరాఫ్ ఎస్.ఐ.సి.టి.
మొవ్వ - 521 135
కృష్ణా జిల్లా.

★

# పరిచయం



పేరు : ఎమ్వీ. రామిరెడ్డి
స్వస్థలం : పెదపరిమి, గుంటూరు - జిల్లా
ఉద్యోగం : ఎస్.ఐ.సి.టిలో
రచనలు : కథలూ,నాటికలూ, కవితలూ వెలుగు చూశాయి.

పాత,కొత్త రచయితలు అందరూ అభిమానులే. పత్రికలు నిర్వహించే కథల పోటీల్లో పాల్గొనడం ఇదే ప్రథమం.

సాధారణ ప్రచురణకు స్వీకరించి,కథా రచనకు మరింత ప్రోత్సాహాన్నందించిన 'అమృతకిరణ్' సంపాదకవర్గానికి, నా రచనలకు సదా స్ఫూర్తినందించే పాపినేని శివశంకర్, చంద్రశేఖర్ ఆజాద్, వై.రాంబాబు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు.

అడ్రస్
యమ్వీ రామిరెడ్డి
ఎస్.ఐ.సి.టి.,
మొవ్వ - 521 135
కృష్ణా - జిల్లా.